లోతట్టు ప్రాంతాలకు వరద ముప్పు

- ప్రతి ఏటా నీట మునుగుతున్న పంటలు
- ఇసుక మేటలతో పనికి రాకుండా పోతున్న పొలాలు
- శాశ్వత పరిష్కారం చూపని అధికారులు
- మున్సిపాలిటీలో పొంగి పొర్లుతున్న నాలాలు

6

విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం హైద్రాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం చర్యలు చేపట్టాలని, నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి విద్యాసంస్థలను పరిశీలించి పారిశుధ్యం, వంటశాలలు, పరిసరాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వైద్య శిబిరాలను నిర్వహించి విద్యార్థులను ఆరోగ్య స్థితిగతులను పరిశీలించాలన్నారు. భూభారతి చట్టంలో వచ్చిన దరఖాస్తులను ఆగస్టు 15నాటికి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 27న గ్రామ పాలన అధికారులకు లైసెన్స్ సర్వేయర్ పరీక్ష నిర్వహిస్తున్నామని, అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులతో సమావేశం నిర్వహించారు. విద్యాశాఖ అధికారులు తమ పరిధిలోని ఆశ్రమ, గురుకులాలను, వసతి గృహాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను పరిశీలించాలని, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టికి సారించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- **కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించిన జడ్పీ సీఈవో గణపతి**



కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థులకు అందించే భోజనం తీరును పరిశీలిస్తున్న సీఈవో

దండేపల్లి జూలై 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జడ్పీ సీఈవో గణపతి అన్నారు. దండేపల్లి కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండే విధంగా సిబ్బంది సూచించారు. వంట గది స్టోర్ రూమ్, కూరగాయలు, విద్యాలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అంతకుముందు దండేపల్లిలో ఇందిరమ్మ పథకం ద్వారా మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ఎంపీవో జేఆర్ ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. గ్రామాల్లో నిజమైన నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తామన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నిర్మాణ పనులను పరిశీలించాలన్నారు. పనులకు దశల వారీగా బిల్లులు చెల్లిస్తామని లబ్ధి దారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సీఈవో వెంట ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, ఎంపీవో విజయప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శ్రీలత రెడ్డి, కస్తూరా విద్యాలయ ప్రత్యే కాధికారి బాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

చెన్నూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని బీఆర్ఎస్ నాయకుడు, చెన్నూరు 9వ వార్డు మాజీ కౌన్సిలర్ అనిల్ పేర్కొన్నారు. మంగళవారం రైతులతో కలిసి పట్టణంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయాధికారులు, సిబ్బంది, ఎరువుల దుకాణాల నిర్వహకులు అంతా కలిసి యూరియా కొరత సృష్టిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. పట్టా పాసు పుస్తకం ఉన్న రైతులకే ఎరువులు ఇస్తామని పేర్కొంటే కౌలు రైతుల పరిస్థితి ఏంటని అధికారులను నిలదీశారు.

గత ప్రభుత్వ హయాంలో ఏ నాడు రైతులకు ఇబ్బందులు కలుగలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి తక్షణం స్పందించి రైతులకు ఇబ్బందులు కలు గకుండా ఎరువులు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



పత్తి పంటలో గడ్డి మందు స్ప్రే చేసుకుంటున్న రైతులు

మార్పు మంచికే..

- గ్లైసిల్ మాయ నుంచి బయటపడుతున్న పత్తిరైతు
- ఈ యేడు నిషేధిత విత్తనాలు, క్యాన్సర్ కారక గ్లైఫోసెట్ గడ్డి మందుకు దూరం
- జిల్లాలో ప్రభుత్వ ఆమోదిత విత్తనాలనే వేసుకున్న మెజార్టీ రైతులు
- ఫలించిన పోలీసు, వ్యవసాయ శాఖ అధికారుల కృషి

నెన్నెల, జులై 22 (ఆంధ్రజ్యోతి) : నకిలీ పత్తివిత్తనాలు, నిషేదిత గడ్డి మందును కట్టడి చేయడంలో పోలీసు, వ్యవసాయ శాఖ అధికారుల కృషి ఫలించింది. జిల్లా పత్తి రైతుల్లో మార్పు మొదలైంది. రైతన్నలు ఇప్పుడిప్పుడే గ్లైసిల్‌మాయ నుంచి బయటపడుతున్నారు. హెచ్‌టీ (హెర్బిసైడ్ టాలరెంట్) పత్తిసాగు చేస్తే తమ ఆరోగ్యంతో పాటు జీవవైవిద్యానికి ముప్పు వాటిల్లుతుందని గ్రహించి లూజు విత్తులు, గ్లైఫోసెట్ మందుకు దూరంగా ఉన్నారు. ఈ సీజన్‌లో జిల్లాలో మెజార్టీ రైతులు ప్రభుత్వ ఆమోదిత విత్తనాలనే వేసుకున్నారు. లూజు వి త్తనాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు, వ్యవసాయశాఖ అధికారులు విశేషంగా కృషి చేశారు. ఇరు శాఖలు సంయుక్తంగా అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడంతో ఈ యేడు జిల్లాలో గ్లైసిల్ సాగు పూర్తిగా తగ్గింది. సరిగ్గా మొలవకపోవడం, ఏపుగా పెరిగి అం తంతమాత్రంగా కాయడం, చీడపీడలు, తెగుళ్లను తట్టు కోక పోవడం, పత్తిలో నాన్యతలేక పోవడం తదితర కారణాలు సైతం రైతులు లూజు విత్తనాలను వీడేలా చేశాయి.

జీవవైవిధ్యానికి ముప్పు...

కలుపు నివారణకు వాడే గ్లైఫోసెట్ మందుతో జీవవైవిద్యానికి పూడ్చలేని నష్టం జరుగుతుందని నిపుణులంటున్నారు. అందులో క్యాన్సర్ కారకాలు ఉన్నాయని తేల్చారు. ఆ మందును పత్తి పంటకు పిచికారి చేస్తే అది పక్కనున్న ఇతర పంటలపైన కూడా ప్రభావం చూపుతుంది. అవి విషపూరితమవుతాయి. పంట ఉత్పత్తులను ఆహారంగా...

(తరువాయి 7లో)

కట్టడిలో అధికారులు సక్సెస్..

పదేళ్లుగా జిల్లాలో గ్లైసిల్ పత్తిసాగు జోరుగా కొనసాగింది. కలుపుబాధ తీరుతుందనే ఆశతో మాత్రమే హెచ్‌టీ విత్తనాలవైపు రైతులు మొగ్గు చూపేవారు. తక్కువఖర్చుతో కలుపు నివారించవచ్చనే ఆలోచన తప్ప దీర్ఘకాల పర్యవసానాలపై వారికి అవగాహన ఉండేదికాదు. క్యాన్సర్ కారకాలున్నాయని, పర్యావరణానికి ముప్పువాటిల్లుతుందని గ్లైఫోసెట్ మందును, హెచ్‌టీ విత్తనాలను ప్రభుత్వం నిషేధించింది. గ్లైసిల్ సాగుకు అడ్డుకట్ట వేసేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టింది. పోలీసు, వ్యవసాయశాఖ అధికారులతో టాస్క్‌ఫోర్స్ టీములు ఏర్పాటు చేసి నిఘాపెంచింది. పోలీసులు దాడులుచేసి కేసులు పెట్టారు. ఒకటికి రెండుసార్లు పట్టుబడిన వారిపై పీడీయాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. ఇరుశాఖల ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. గ్రామాల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టి రైతుల్లో మార్పు తేవడంలో అధికారులు దాదాపుగా విజయం సాధించారు.

నకిలీ విత్తనాలను కట్టడి చేశాం..



పకడ్బందీ ప్రణాళికతో నకిలీవిత్తనాలను కట్టడి చేశాం. టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసి సీజన్ కు ముందు నుంచే కల్తీదందా చేసే వ్యాపారులు, దళారులపై నిఘా ఏర్పాటు చేశాం. ప్రభుత్వ నిషేదిత హెచ్‌టీ విత్తనాలు, గ్లైఫోసెట్ గడ్డి మందుతో పట్టుబడిన వారిపై కేసులు నమోదుచేశాం. వ్యవసాయశాఖ సమన్వయంతో గ్రామాల్లో కళాజాత ప్రదర్శ నలు, ర్యాలీలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి రైతులను చైతన్య పరిచాం. తాము చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలు ఇచ్చాయి.

- రవికుమార్ ఏసీపీ, బెల్లంపల్లి

రైతుల్లో మార్పు వచ్చింది..



క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు గ్లైఫోసెట్ అనర్థాల గూర్చి వివరించాం. దళారులు, వ్యాపారుల మాయ మాటలు నమ్మి లూజు విత్తనాల జోలికి వెళ్లొద్దని సదస్సులు ఏర్పాటుచేసి అవగాహన పెంపొందించాం. ఫలితంగా రైతుల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వ ఆమోదిత విత్తనాలనే వేసుకుంటున్నారు. గ్లైఫోసెట్‌కు బదులుగా కలుపు నివారణకు మంచి మం దులు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. బ్రాండెడ్ విత్తనాలతో ఆశించిన దిగుబడి వస్తుంది.

-సురేఖ, ఏడీఏ, భీమిని

భారీ వర్షం..

- **మందమర్రిలో రోడ్లపైనే నిలిచిపోయిన వరద నీరు**





మందమర్రి పాలచెట్టు ఏరియాలో రోడ్లపై వరద నీరు, నస్పూర్ గేట్ వద్ద నిలిచిన వర్షపు నీరు

మందమర్రిటౌన్, జూలై22 (ఆంధ్రజ్యోతి): మందమర్రి మండలంలో మంగళవారం ఎడ తెరపిలేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లపై నుంచే వరద నీరు ప్రవహించింది. పట్టణంలోని కేకే5 ఫిల్టర్‌బెడ్ ఏరియాలో నివాసాల్లోకి నీరు చేరింది. అంతేగాకుండా స్థానిక కేకే5, హట్స్ ఏరియాల్లో కూడ నీరు నిలిచింది. లోత ట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరుకుంది. ఎదురుగా ఉన్న క్వార్టర్లలోకి నీరు చేరింది. పాలచెట్టు ఏరియా నుంచి మొదలు కొని కేకే5 బంగ్లా వరకు రోడ్లపై నుంచే వరదనీరు పెద్దఎత్తున ప్రవహించింది. వచ్చేపోయే వాహనదారులు వరద నీరుతో తీవ్రఇబ్బందులు పడ్డారు. స్థానిక మందమర్రి రైల్వే స్టేషన్ సమీపంలోని చెరువులోకి నీరు చేరుకుంది. 3వ జోన్ ఏరియాలో కూడ క్వార్టర్ల ముందు నీరు నిలిచింది. పాలచెట్టు ఏరియాలోని ప్రజలు మాట్లాడుతూ ఎన్ని సార్లు చెప్పినా సింగరేణి యాజమాన్యం నీటి తొలగింపుపై స్పందించడం లేదన్నారు.

జాతీయ రహదారిపై నిలిచిన నీరు...

నస్పూర్ : నస్పూర్‌లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. నస్పూర్ గేట్ వద్ద జాతీయ రహదారిపై వర్షపు నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు, వివిధ హోదాలు కలిగిన అధికారులు ఈ మార్గం మీదుగానే వెళతుంటారు. అధికారులు స్పందించి వర్షపు నీరు నిలు వకుండా చర్యలు చేపట్టాలని వాహనాల చోద కులు కోరుతున్నారు.

మందమర్రిరూరల్ : మండలంలోని గ్రామాల్లో సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్లపై నీరు నిలిచి పోయింది. పొన్నారంలో ప్రధానరోడ్డుపై నీరు నిలిచి పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

గిగ్ వర్కర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటుపై హర్షం

శ్రీరాంపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : గిగ్ వర్కర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు ఇవ్వడంపై ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింజుపల్లి నర్సింగ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గడ్డం వివేక్ రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత గిగ్ వర్కర్లు వెళ్లి తమ సమస్యలను ఆయనకు విన్నవించుకోగా, ఆయన వెంటనే సీఎం దృష్టికి తీసుకెళ్లి గిగ్ వర్కర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు కృషి చేశారని కొనియాడారు. సీఎం, మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతు న్నట్లు ఎస్సీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింజుపల్లి నర్సింగ్, మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మడి శ్రీనివాస్, యూత్ జిల్లా అధ్యక్షుడు బింగి సదానందం కృతజ్ఞతలు తెలిపారు.

నియామకం



శ్రీనివాస్

చెన్నూరు, జూలై22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంక్షేమ సంఘం జిల్లా సెక్రటరీగా చెన్నూరు విద్యుత్ ఏఏఈ పసరకొండ శ్రీనివాస్ నియమితులయ్యారు. మంగళవారం మంచిర్యాలలో ప్రెసిడెంట్ ఆనందం, జనరల్ సెక్రటరీ కుమార స్వామిల ఆధ్వర్యంలో నిర్వహించిన సర్కిల్ సర్వసభ్య సమావేశంలో శ్రీనివాస్‌ను సెక్రటరీగా ఎన్నుకున్నారు. అలాగే జిల్లా ప్రెసిడెం ట్‌గా ఏడీఈ రాజేశంను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఉత్తమ్, డీఈలు రాజన్న, కైసర్ పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

చెన్నూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు నియోజకవర్గంలో బుధవారం రాష్ట్ర కార్మిక,మైనింగ్‌శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటించనున్నారు. ఉదయం 11గంటలకు మందమర్రి మండలంలోని అందుగులపేటలో గల సాయిమిత్ర గార్డెన్స్‌లో నిర్వహించే ఇందిర మహిళశక్తి సంబరాల్లో పాల్గొనున్నారు. అలాగే మధ్యాహ్నం 12.30 గంటలకు చెన్నూరు పట్టణంలో గడిమైసమ్మబోనాల జాతరలో పాల్గొననున్నారు.

మంత్రి చేతుల మీదుగా రేషన్‌కార్డుల పంపిణీ

మందమర్రిటౌన్: మందమర్రి పట్టణంలో రేషన్‌కార్డుల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రేషన్‌కార్డుల పంపిణీకి మంత్రి డాక్టర్ వివేక్‌వెంకటస్వామి హాజరవుతున్నారు. స్థానిక సాయిమిత్ర గార్డెన్‌లో ఈ రేషన్‌కార్డుల పంపిణీప్రక్రియ కొన సాగనుంది. దాదాపు 2వేలకార్డులకుపైగా పంపిణీ చేయనున్నారు. మంత్రిరాక సం దర్భంగా లోటుపాట్లు జరుగకుండా అధికారులు లబ్ధిదారులకోసం మెరుగైనఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సాయిమిత్ర ఫంక్షన్ హాల్ ను సీఐ శశిధర్‌రెడ్డి పరిశీలించారు. బెల్లంపల్లి డాగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేయనున్నారని తెలిపారు. సాయిమిత్ర ఫంక్షన్‌హాల్ పరిసర ప్రాంతాల్లో కూడ పెద్ద ఎత్తున పోలీసులు బందోబస్తు నిర్వహిం చనున్నారు.

ప్రయాణికులకు సూచన..

- **25 నుంచి పలు రైళ్లు రద్దు**

బెల్లంపల్లి, జూలై22 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి రైల్వే స్టేషన్ దగ్గర ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లాకింగ్ పనుల నేపథ్యంలో ఈ నెల 25 నుంచి 27 వరకు కాజీపేట నుంచి బల్లార్షా మార్గంలో నడిచే పలు రైళ్లను పాక్షికంగా, మరికొన్ని రైళ్లను పూర్తిగా రద్దు చేస్తున్నారు. కరీంనగర్ నుంచి సిర్పూర్‌టౌన్ నడిచే కరీంనగర్ మెము ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు రద్దు చేశారు. అలాగే రామగిరి ఎక్స్‌ప్రెస్‌ను, బల్లార్షా కాజీపేట బల్లార్షా ఎక్స్‌ప్రెస్‌ను 25 నుంచి ఈనెల 27వ తేదీ వరకు, కాజీపేట టూ బల్లార్ష ఎక్స్‌ప్రెస్ నుంచి 24 నుంచి 26 వరకు, సికింద్రాబాద్ నుంచి సిర్పూర్‌కాగజ్‌నగర్ నడిచే సికింద్రాబాద్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 25 నుంచి 27 వరకు రద్దు శారు. హైదరాబాద్ నుంచి సిర్పూర్‌కాగజ్‌నగర్ నడిచే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు భద్రాచలం రోడ్డు బల్లార్షా సిర్పూర్‌టౌన్ టూ భద్రాచలం రోడ్డు సింగరేణి ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్‌కు నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌ను 25 నుంచి 27 వరకు నడిచే రైళ్లు రద్దు చేస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే ఇంటర్‌లాకింగ్ పనుల నేపథ్యంలో న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్, నిజామోద్దీన్ నుంచి బెంగళూరు న్యూఢిల్లీ నుంచి చెన్నై సెంట్రల్ వెళ్లే పలు రైళ్లు సూ పర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడువనున్నాయి.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన అవసరం



కోటపల్లిలో న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి రవి

కోటపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన అవసరమని చెన్నూరు కోర్టు సివిల్ జడ్జి పి.రవి అన్నారు. మం గళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, తల్లిగర్భం నుంచి భూగర్భంలోకి వెళ్లేంత వరకు ప్రతిఒక్కరిపై చట్టాల ప్రభావం ఉంటుందన్నారు. లింగనిర్ధారణ పరీక్షలను నేరాలుగా భావించడం జరుగుతుందని దీంతోనే గర్భంలో శిశువు ఉన్నప్పటి నుంచే చట్టాల రక్షణ కనబడుతుందన్నారు. మనిషి సాధించాలను కుంటే ప్రయత్నం చేస్తే కానిది ఏది లేదని, జీవితంలో చదువు ముఖ్యమని, చదువుతోనే జీవితాల్లో మార్పు వస్తుందన్నారు. హక్కులు, చట్టాలు, ఆర్టికల్19 ప్రకారం స్వేచ్ఛగా మాట్లాడుకునే హక్కులు, పేదప్రజలకు ఉచిత న్యాయసలహాలు, లోక్‌అదాలత్ తదితర అంశాలపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో చెన్నూరురూరల్ సీఐ బన్సీలాల్, పోక్సోకోర్టు స్పెషల్ పబ్లిక్‌ప్రా సిక్యూటర్ రాంబాబు, ఎస్ఐ రాజేందర్, న్యాయవాదులు మహేష్, పున్నం, రాజేష్,నాగులు, వ్యవసాయా ధికారి సాయికృష్ణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సందీప్, సీనియర్ ఉపాధ్యా యుడు సలీం, గ్రామ యువకులు, కస్తూర్బా విద్యార్థినీలు పాల్గొన్నారు.

నిలకడగానే విద్యార్థుల ఆరోగ్యం

- **ఎలాంటి ఆందోళన అవసరం లేదు**
- **కలెక్టర్ కుమార్ దీపక్**



ఆసుపత్రిలో విద్యార్థినిని పరామర్శిస్తున్న కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన హాస్టల్‌లో అస్వస్థతకు గురైన విద్యార్థినుల ఆరోగ్యం నిలకడ గానే ఉందని, ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు తరుణి, రేవతిలను కలిసి మాట్లాడారు. టాన్సిలైటిస్ జ్వరంతో బాధపడుతున్నారని వైద్యులు కలెక్టర్‌కు తెలిపారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు కలెక్టర్ సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినుల ఆరోగ్యం పట్ల ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కలుషితం ఆహారం తినడం వల్ల అస్వస్థతకు గురయ్యారని ప్రచారం చేయడం సరైంది కాదని, వాస్తవ సమాచారాన్ని చేరవేయాలన్నారు. విద్యార్థినులకు అందిస్తున్న వైద్యసేవలను ఏటీడీఏ, పాఠశాల ప్రిన్సిపల్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. అవాస్తవాలను ఎవరైనా ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలుంటాయన్నారు. ఆయన వెంట డీటీడీవో జనార్ధన్, ఆర్ఎంవో శ్రీధర్ ఉన్నారు.

- **ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. మంగళవారం మాతా శిశు ఆసుపత్రిని పరిశీలించి రోగులతో మాట్లాడారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిశ్చంద్ర రెడ్డి, వైద్యాధికారులు శ్రీమన్నారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

- **జిల్లా వ్యవసాయాధికారి చత్రునాయక్**



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చత్రునాయక్

హాజీపూర్, జూలై22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కొరత లేదని జిల్లా వ్యవసాయాధికారి చత్రునాయక్ అన్నారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ముల్కల్ల రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. ఈ పంటకాలానికి సరిపడా యూరియా మార్కెట్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు ఆధార్‌కార్డుతో ఈపీవోఎస్ మిషన్ ద్వారా యూరియాను కొనుగోలు చేయాలన్నారు. పచ్చిరొట్ట పూత దశలో ఉన్నప్పుడు దాన్ని కలియదున్నితే ఒక బస్తా డీఏపీకి బదులు సింగిల్ సూపర్‌ఫాస్పెట్ ఎరువును వినియోగించడం వల్ల భూమికి సూక్ష్మ పోషకాలు, స్థూల పోషకాలు పంటకు అందుతాయన్నారు. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో క్రిష్ణ, కుమార్‌యాదవ్, ప్రభాకర్‌రావు, రైతులు పాల్గొన్నారు.



లోతట్టు ప్రాంతాలకు వరద ముప్పు

- ప్రతి ఏటా నీట మునుగుతున్న పంటలు
- ఇసుక మేటలతో పనికి రాకుండా పోతున్న పొలాలు
- శాశ్వత పరిష్కారం చూపని అధికారులు
- మున్సిపాల్టీలోనూ పొంగి పొర్లుతున్న నాలాలు


కాగజ్‌నగర్ లోతట్టు ప్రాంతాల్లోకి వచ్చిన వరద నీరు

కాగజ్‌నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వానొచ్చిందంటే కాగజ్‌నగర్ డివిజన్‌లో ప్రజలు బిక్కు బిక్కుమంటు గడుపాల్సినప పరిస్థితి.. చుట్టూ వాగులు, వంకలు కలిగి ఉన్న కాగజ్‌నగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలో పెద్దవాగు, ఎర్రవాగు, ప్రాణహిత నదుల వరదపోటుకు ప్రతి ఏటా వందలాది ఎకరాల పంట భూములు నీట మునుగుతున్నాయి. ఆగస్టు, సెప్టెంబరు వచ్చిదంటే వరదపోటు భయంతో లోతట్టు గ్రామాల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటు బతుకీడుస్తున్నారు. ముఖ్యంగా పెన్‌గంగ పరివాహక ప్రాంతంలోని సిర్పూరు, పెద్దవాగు వాగు పరిసరాల్లో ఉన్న భట్టుపల్లి, అందవెల్లి గ్రామాలతో పాటు ఎర్రవాగు ప్రాంతంలో ఉన్న దహెగాం, పెంచికల్‌పేట మండలాల్లోని మొర్రిగూడ, కమ్మర్‌గాం, గుండపెల్లి కొండపల్లిలోని గొల్లవాడ తదితర గ్రామాల్లో వరదలు పంట భూములను ముంచెత్తుతున్నాయి.

ప్రాణహితకు వరద వస్తే..

ప్రాణహిత నదికి భారీ వరదవచ్చిన సందర్భాల్లో కౌటాల, సిర్పూరు(టి), బెజ్జూరు మండలాల్లోని పరివాహక లోతట్టు ప్రాంతాల్లోని పంట భూములు నీట మునగటం పరిపాటిగా మారిపోయింది. అంతేకాదు వర్షాకాలం మొదలు కాగానే చిన్న వాగులు, వంకలు పొంగి పొర్లుతుండటంతో నీటి కోతకు గురై పంట భూముల్లో ఇసుకమేటలు వేస్తున్నాయి. ఫలితంగా సాగు భూములు ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. ఈ సమస్యపై శాశ్వత పరిష్కారం చూయించాలని రైతులు, లోతట్టు గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నా ఇప్పటి వరకు చర్యలు చేపట్టిన దాఖాలాలు లేవు.

తాజాగా మరోసారి భారీవర్షాలు కురుస్తుండటంతో ప్రస్తుతం ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. పరివాహక ప్రాంతంలోని పత్తి పంట వందలాది ఎకరాల్లో నీట మునిగింది. దాంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇటు డివిజన్ కేంద్రమైన కాగజ్‌నగర్ మున్సిపాటిటీలోను నాళాలు కబ్జాకు గురికావటంతో వరద నీరు బయటికి వెళ్లే దారి లేక కాలనీలు అన్నీ జలమయం అవుతున్నాయి. దాంతో ఇళ్లలోకి నీరు చేరి పట్టణ వాసులు నానా ఇబ్బందులు పడుతున్నా రు. కళ్లెదుటే నాళాలు కబ్జా పర్వం కొన సాగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోక పోవటంతోనే ఈ సమస్య వస్తోందని కాలనీ వాసులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ మండలాల పరిస్థితి...

చిన్నపాటి వర్షాలకే కాగజ్‌నగర్ మండలంలోని భట్టుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సీ బాపు కాలనీ ఇళ్లలోకి నీరు వస్తోంది. ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులకు, స్థానిక నాయకులు మొర పెట్టుకున్న కూడా ఇంతవరకు పరిష్కారం కాలేదని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. తమ ప్రాంతం పూర్తిగా లోతట్టు ప్రాంతంగా ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. ఏటా వర్షాకాలంలో తమ ఇళ్లలోకి వర్షం నీరు రావటం, ఇళ్లముందు నీరు నిలుస్తుండటంతో దోమలు, ఈగలు, విషకీటకాలతో అనేక అవస్థ లు పడుతున్నామని, జ్వరాల బారిన సోకి అవస్థలు పడుతున్నామని, ఏటా తమ కాలనీలో మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొంటున్నారు.


కాగజ్‌నగర్ ఎస్సీ బాలుర వసతి గృహం చుట్టూ చేరిన నీరు

అలాగే సిర్పూరు(టి) మండలంలో లోతట్టు ప్రాంతంగా టోంకిని, పారిగాం ఉంది. మహారాష్ట్ర ప్రాంతంలోని ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల కు ఏటా ఈ రెండు గ్రామాలు పెన్‌గం గా బ్యాక్ వాటర్ సమస్యతో పూర్తిగా జలమయం అవుతున్నాయి. ఈ రెండు గ్రా మాల్లో ఉండే పంట పొలాలు నీటి ముని గి పోతున్నాయి. దాదాపు 200 ఎకరాల్లో ఇసుక మేటలు కూడా పడుతున్నాయి. రైతులు అనేక ఇబ్బందులు పడాల్సి పరిస్థితి నెలకొంది. వీటితో పాటు చింతలమానేపల్లి మండలంలోని దిందా గ్రామం కూడా చుట్టు నీరు చేరుతోంది. ఫలితంగా బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామసమీపానికి ప్రాణహిత పోటెత్తి ప్రవ హించటం దిగువ ప్రాంతంగా ఉండటమే కాకుండా వంతెన కూడా లోలెవల్‌గా ఉండటమే ప్రధాన సమస్యగా మారింది. ప్రతీ సంవత్సరం ఈ గ్రామానికి వరదపోటు తప్పని పరిస్థితి నెలకొంది.

వినతిపత్రాలిస్తున్నా..పట్టించుకునే వారేరీ?

పెంచికల్‌పేట మండలం కొండపల్లి గ్రామ సమీపంలో చెరువు ఉండటం, వీటికి సంబంధించిన చెరువు మత్తడి తెగి ఉండటంతో చిన్నపాటి వర్షానికే ఈ గ్రామం సమీపంలోకి నీరు రావటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. అధికారులు వేసవిలో మత్తడికి మరమ్మతులు చేపట్టకపోవటంతో తమ గ్రామానికి ఈ సమస్య వస్తోందని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రాణహిత, పెద్దవాగు కలిసే ప్రాంతం వద్ద బ్యాక్ వాటర్‌తో లోతట్టు ప్రాంతాలైన మొర్రిగూడ, జిల్లెడ, కమ్మర్‌గాం, గుండెపల్లి గ్రామాలకు ఏటా వరద ముంపు ఉంటుంది.

ఈ గ్రామాల్లో 200 ఎకరాలకుపైగానే పంటలు నీటమునిగి పోతున్నాయి. ప్రతీ సంవత్సరం ఈ సమస్యను పరిష్కరించాలని వినతిపత్రాలిస్తున్నప్పటికీ అధికారులు ఏ మాత్రం దృష్టి సారించటం లేదు. అధికారులు, నాయకులు ఇప్పటికైనా ఈ సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించేటట్టు చూడాలని అంతా కోరుతున్నారు.

సమస్యలపై పట్టించుకోవడం లేదు.. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు



జిల్లాలో లోతట్టు ప్రాంతాల సమస్యలను పరిష్కరించటంలో అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవటం లేదు. సిర్పూరు, ఆసిఫాబాద్ నియోజకర్గాల్లో సమస్య అధికంగా ఉంది. అధికారులు, నాయకులు ఏ మాత్రం దృష్టి సారించటం లేదు. ఏటా ప్రాణహిత, పెద్దవాగు ఉప్పొంగి లోతట్టు ప్రాంతాల్లోని వందలాది ఎకరాల్లో ఇసుక మేటలు పడుతున్నాయి. వర్షాకాలం ప్రారంభంలోనే ఈ సమస్య ఏర్పడుతోంది. భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏంటి? కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో లోతట్టు వార్డులపై కూడా అధికారులు దృష్టి సారించి ప్రత్యామ్నాయ దిశగా చర్యలు చేపట్టాలి.

శనగ గింజ గొంతులో ఇరుక్కుని బాలుడి మృతి


రిషి(ఫైల్)

కౌటాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం కన్కి గ్రామానికి చెందిన జాడి కళ్యాణి, ప్రకాష్ దంపతుల కుమారుడు రిషి(4) శనగ గింజ గొంతులో ఇరుక్కుని సోమవారం రాత్రి మృతి చెందాడు. కళ్యాణి, ప్రకాష్ దంపతులు ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కౌటాల మండల కేంద్రంలో నివాసం ఉంటున్నారు. సోమవారం కౌటాలలో సంత కావడంతో తల్లిదండ్రులతో కలిసి రిషి కూరగాయల సంతకు వెళ్లాడు. సంతలో శనగలు కావాలని మారాం చేయడంతో తండ్రి శనగలు కొనుగోలు చేశాడు. ఇంటికి వచ్చిన తరువాత రిషి శనగలు తింటుండగా గొంతులో ఇరుక్కోవడంతో అపస్మా రక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే బాలుడిని కౌటాలలోని ప్రైవేటు ఆసుపత్రి కి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని మంచిర్యాలకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడికి శనగలు కొని ఇవ్వగా ఆ శనగలే తన కుమారుడి మృతికి కారణమయ్యాయంటూ తల్లిదండ్రులు బోరున విలపించడం అక్కడున్న వారిని కంట తడి పెట్టించింది.

ఎరువుల దుకాణాల తనిఖీ

దహెగాం, జూలై 22(ఆంధ్రజ్యోతి): దహెగాం మండల కేంద్రంలోని పలు ఎరువు దుకాణాలను మంగళవారం వ్యవసాయాధికారి రామకృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దహెగాం సొసైటీ ద్వారా ఇప్పటి వరకు 10680 బస్తాల యూరియా రైతుల కొరకు పంపిణీ చేయడం జరిగిందని, అలాగే డీసీఎంఎస్, హెచ్ఏసీఏ, ఏఆర్ఎస్‌కే సెంటర్ల ద్వారా 24300 బస్తాలు, ప్రైవేటు డీలర్ల ద్వారా 12000 బస్తాలు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఎవరైనా డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట వ్యవసాయాధికారులు ఉన్నారు.

పోలీసుల పేరుతో డబ్బు వసూలు చేసిన వ్యక్తి రిమాండ్

కౌటాల, జూలై 22 (ఆంధ్రజ్యోతి): పోలీసుల పేరుతో డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ ముత్యం రమేష్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో చింతలమానేపల్లి, కౌటాల ఎస్సైలు నరేష్, విజయ్‌లతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతలమానేపల్లి మండలం బాలాజీఅనుకోడ గ్రామానికి చెందిన యువతీ, కర్జవెల్లి గ్రామానికి చెందిన యువకుడు ప్రేమించుకున్నారు. పెద్దల అంగీకారంతో నిశ్చితార్థం చేసుకున్నారు. పెళ్లి విషయంలో గొడవలు కావడంతో వివాహం ఆగిపోయింది. దీంతో అమ్మాయి, అబ్బాయి కుటుంబసభ్యులపైన పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో దహెగాం మండలం రాంపూర్‌కు చెందిన ఒడ్రే గణేష్ అనే వ్యక్తి పోలీసులు తనకు బాగా తెలుసునని కేసు లేకుండా చేస్తానని అబ్బాయి కుటుంబసభ్యులను నమ్మబలికాడు. అబ్బాయి తండ్రి వద్ద నుంచి ఏడు విడతలుగా రూ.75 వేలు తీసుకున్నాడు. తరువాత మోసపోయినట్లు గుర్తించి అబ్బాయి తండ్రి జునగరి సత్యనారాయణ గణేష్‌పై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చింతలమానేపల్లి పోలీసులు గణేష్‌పై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కాగజ్‌నగర్ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని భట్టుపల్లి గ్రామానికి చెందిన మేకల సురేష్ అలియాస్ గణేష్ (22) అనే యువకుడు విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందాడు. ఇంట్లో ఫ్యాన్ బిగిస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు పోలీసులు తెలిపారు.

మేము తెలంగాణలోనే ఉంటాం

- ఎమ్మెల్యేకు బోలపటార్ గ్రామస్థుల వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న బోలపటార్ గ్రామస్థులు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తాము తెలంగాణలోనే ఉంటామని కెరమెరి మండలం బోలపటార్ గ్రామస్థులు ఎమ్మెల్యే కోవలక్ష్మికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. కెరమెరి మండలంలోని సరిహద్దున వివాదస్పదంగా ఉన్న గ్రామాలు తెలంగాణలో ఉన్నాయని తమకు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఇతర అన్ని డాక్యూమెంట్లు తెలంగాణవే ఉన్నాయన్నారు. మహారాష్ట్ర నుంచి తమకు ఎలాంటి సౌకర్యం లేదని అన్ని సౌకర్యాలు తెలంగాణ నుంచే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలి

వాంకిడి, జూలై 22(ఆంధ్రజ్యోతి): అయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని మ్యాట్రిక్ ఫామ్ అయిల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫీల్డ్ ఎగ్జిక్యూటీవ్ ప్రేమ్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని జైపూర్ శివారులోని లోనరి మల్లయ్య, గడేకర్ నాందేవ్ చేనులో అయిల్ పాం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయిల్ పామ్ పంటకు మంచి డిమాండ్ ఉందన్నారు. రైతులకు 90 శాతం రాయితీపై మొక్కలు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

ఆసిఫాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వాంకిడి గ్రామ పంచాయతీలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, నిధుల దుర్వినియోగంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని కోరుతూ మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన


కెరమెరిలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై మధుకర్

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్నపిల్లలు మత్తుకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ అలవాటు పడిన వారి జీవితాలు అంధకారమ వుతాయని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు సురేష్, సాగర్, సువర్ణ, ప్రధానాచార్యులు కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కెరమెరి(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు మాదక ద్రవ్యాల నివారణపై ఎస్సై మధుకర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

తిర్యాణిలో ఎమ్మెల్యే పర్యటన

తిర్యాణి, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎమ్మెల్యే కోవలక్ష్మి మంగళవారం పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కన్నెపల్లి మాజీ సర్పంచ్ దుర్గయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. విజయనగరం నుంచి గంభీరావుపేట్, గోయగాం గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డును పరిశీలించి రహదారుల దుస్థితిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడారు. నాయకులు సరస్వతి, రాజయ్య, గుణవంతరావు, శ్రీనివాస్, కమల, అంకుష్, మల్లేష్, మధుకర్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

మంచిర్యాలక్రైం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం బస్టాండ్ సమీపంలో టీఎస్20టీ 3230 బ్లాక్ కలర్ ఫ్యాషన్ ప్రోను గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బస్టాండ్ ఎదుట సులభ్ కాంప్లెక్స్ వద్ద పార్కింగ్ చేసిన వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని తెలిపారు. వాహనం కనిపిస్తే సెల్ నెంబర్ 8712656535 నంబర్‌కు సమాచారం అందించారని ఎస్‌ఐ సూచించారు.

పురుగుల మందు డబ్బాతో మహిళ ఆందోళన

చెన్నూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి): తమకు ప్రభుత్వం కేటాయించిన భూమిలో సాండ్ బజార్‌ను ఏర్పాటు చేయవద్దని చెన్నూరు పట్టణానికి చెందిన నిమ్మల రాంబాయి అనే మహిళ మంగళవారం పురుగుల మందు డబ్బా పట్టుకుని ఆందోళనకు దిగింది. పట్టణంలోని జాతీయ రహదారి మార్గం సమీపంలో ఉన్న సర్వే నంబరు 863లోని ప్రభుత్వ భూమిలో సాండ్ బజార్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తమకు తెలిసిందని, సదరు భూమిని రజక సామాజికవర్గానికి చెందిన పేద కుటుంబాలకు ప్రభుత్వం గతంలో ఇనాం కింద కేటాయించిందని ఆమె పేర్కొంది. ఆ భూమిలో తమ తాత ముత్తాతల నుంచి వ్యవసాయం చేస్తున్నామని, ఆ భూమే తమ జీవనధారమని తెలిపింది. సదరు భూమిలో సాండ్ బజార్ ఏర్పాటు నిర్ణయాన్ని అధికారులు విరమించుకోవాలని లేదంటే పురుగుల మందు తాగి ఆత్మహత్య తీసుకోవాల్సి వస్తుందని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

సింగరేణి సమాచారం

హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా సారయ్య



శ్రీరాంపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి మైనర్స్ అండ్ ఇంజ నీరింగ్ వర్కర్స్ యూనియన్(హెచ్ఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడిగా తిప్పారపు సారయ్య ఎన్నికయ్యారు. గోదావరిఖనిలో నిర్వహించిన సమావేశంలో ఆయన ఎన్నిక జరిగింది. సారయ్య 1998 నుంచి 2006 వరకు తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం తెలంగాణ జనసభలో పనిచేశారు. ప్రొఫెసర్ జయశంకర్, కోదండరాంల సూచనల మేరకు 2006లో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు. తెలంగాణ ఆవిర్భవించిన తరువాత హెచ్ఎంఎస్ యూనియన్‌లో సాధారణ కార్యకర్తగా చేరి అంచెలంచెలుగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎదిగారు. సారయ్య ఎన్నికకు సహకరించిన హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ రియాజ్ అహ్మద్, ఇతర నాయకులకు శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు వి అనిల్‌రెడ్డి, కార్యదర్శి పొనగంటి అశోక్, పిట్ కార్యదర్శులు కృతజ్ఞతలు తెలిపారు.

సెక్యూరిటీ సిబ్బంది పాత్ర గొప్పది


ప్రశంసాపత్రం అందిస్తున్న జీఎం ఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆస్తుల సంరక్షణలో సెక్యూరిటీ సిబ్బంది పాత్ర గొప్పదని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్ అన్నారు. ఇటీవల ఆర్‌కే 5 గనిలో దొంగతనాన్ని అడ్డుకుని, దొంగలను పట్టుకున్న సెక్యూరిటీ సిబ్బందిని ఆయన సన్మానించి, ప్రశంసాపత్రాలు అందించారు. సెక్యూరిటీ విభాగంలో ఏర్పాటు చేసిన నూతన ఫర్నిచర్‌ను ప్రారంభించారు. సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన డి శేఖర్ తల్లిదండ్రులు మధునక్క-రాజయ్యకు సెక్యూరిటీ సిబ్బంది ఇచ్చిన 70వేల రూపాయలను అందించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

వర్షాకాలం.. వ్యాధుల కాలం..

- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- ప్రతీ గని, విభాగంపై సదస్సులు
- నివారణపై సూచనలు
- కరపత్రాల పంపిణీ


ఆర్‌కే 7 గనిపై అవగాహన కల్పిస్తున్న ఏరియా వైద్యాధికారి(ఫైల్)

శ్రీరాంపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వానలు జోరుగా పడుతున్నాయి. ఈ సమయంలో వచ్చే వ్యాధులు ప్రజలను చాలా ఇబ్బందులకు గురిచేస్తాయి. నీరు, ఆహారం, ఈగలు, దోమల ద్వారా తీవ్ర అనారోగ్యం కలిగి ఆస్పత్రుల పాలయ్యే అవకాశం ఉంది. అందువల్ల ముందు జాగ్రత్తగా సింగరేణి వైద్య విభాగం అధికారులు అన్ని గనులు, విభాగాలపై ఉదయం షిఫ్టులో సింగరేణి ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్నారు. సదస్సులు ఏర్పాటు చేసి, వర్షాకాలం వచ్చే వ్యాధులు, నివారణ చర్యల గురించి తెలియజేస్తున్నారు. కరపత్రాలు పంచుతూ అందులో పలు సూచనలు అందిస్తున్నారు. ఒకవేళ వ్యాధిబారిన పడితే వెంటనే సింగరేణి ఆస్పత్రికి వచ్చి చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు.

ప్రతీ రోజు సదస్సు

శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి వైద్య విభాగం ఆధ్వర్యంలో కాలానుగుణంగా పలు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఎండాకాలం వడదెబ్బ నుంచి ఉద్యోగులు తమను తాము రక్షించుకోవడం, విధులకు హాజరు కావడం గురించి తెలియజేస్తున్నారు. ఇప్పుడు వర్షాకాలం కావడంతో ఈ సమయంలో వచ్చే వ్యాధులు, ముందస్తు నివారణ చర్యల గురించి గనులు, విభాగాలపై సదస్సుల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. వ్యాధులు రాకుండా ఉండాలంటే పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని తెలియజేస్తున్నారు.

దోమలు వృద్ధి చెందకుండా ఏం చేయాలి?

ఒక చిన్న బాటిల్ క్యాప్‌లో ఉన్న నీటిలో కూడా దోమలు వృద్ధి చెందుతాయి. ఇవి డెంగీ, మలేరియా వంటి ప్రమాదకర వ్యాధులను వ్యాప్తి చేస్తాయి. వీటిని నివారించాలంటే ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటి ఆవరణలో నీరు నిల్వకుండా చూసుకోవాలి. పగిలిన పెంకులు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ఉపయోగంలో లేని వస్తువులు, చెత్తకుండీల్లో వేయాలి. ఎయిర్ కూలర్, నీటి తొట్టీలు, పాత్రల్లో ఉండే నీటిని వారానికి ఒకమారు పారబోసి పూర్తిగా ఆరబెట్టుకోవాలి. దోమలు కుట్టకుండా కిటికీలకు సన్నని జాలీలు (మెష్‌లు) బిగించాలి. శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే పొడవైన దుస్తులను ధరించాలి. ప్రవహిస్తున్న కాలువ నీటిలో మట్టి, చెత్త వేయకుండా చూసుకోవాలి. దోమల నివారణకు తరచూ ఫాగింగ్ చేయించాలి.

నివారణే ఏకైక మార్గం

- డాక్టర్ లోకనాథ్ రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా మెడికల్ ఆఫీసర్



వ్యాధులు వచ్చిన తరువాత చికిత్స పొందేకంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం చాలా ఉత్తమం. ప్రస్తుత వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించకుంటే వ్యాధులతో ఆస్పత్రులపాలు కావడం తప్పదు. బాగా ఉడికించిన ఆహారం, తాజాపండ్లు, కూరగాయలు తీసుకుంటూ రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. నిత్యం కనీసం రెండు నుంచి మూడు లీటర్ల నీటిని తాగాలి. ఏవైనా అనారోగ్య సమస్యలు ఎదురైతే, లక్షణాలు కనిపిస్తే అశ్రద్ధ చేయకుండా ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలి.

పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, అధికారులు

మందమర్రిటౌన్, జూలై 22(ఆంధ్రజ్యోతి): సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు సీనియారిటి ప్రకారం పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు జరుగుతుందని మందమర్రి ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ తెలిపారు. మంగళవారం స్థానిక సీఈఆర్‌క్లబ్‌లో మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాలకు సంబంధించి క్వార్టర్ కౌన్సెలింగ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంస్థలో పైరవీలకు తావులేదని పారదర్శకంగా కేటాయిస్తున్నామని చెప్పారు. క్వార్టర్లలో ఏమైన సమస్యలు ఉంటే సంబంధిత డిపార్ట్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. వారు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. వంద క్వార్టర్స్‌కు 275 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా 26 మంది మాత్రమే క్వార్టర్లను తీసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం విజయప్రసాద్, సివిల్ ఎస్ఈ శ్రీధర్, సీనియర్ కార్తీక్, ఓఎస్ రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

జాప్యం లేకుండా ఉద్యోగులకు సేవలు అందించాలి


మాట్లాడుతున్న సునీల్ కుమార్

శ్రీరాంపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి జాప్యం లేకుండా సింగరేణి ఉద్యోగులకు సేవలందించాలని శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం(పర్సనల్) ఎస్. సునీల్ కుమార్ సూచించారు. పర్సనల్ విభాగం సిబ్బందితో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. గనులు, విభాగాల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖా స్తుల వివరాలు తెలియజేయాలన్నారు. దరఖాస్తుదారు సమస్య వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఉద్యోగులు ఉత్సాహంగా పని చేస్తూ జీరో పెండింగ్ దరఖాస్తుల ఏరియాగా మార్చాలని ఆదేశించారు. అనంతరం ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల టర్మినల్ బెనిఫిట్స్, గృహ రుణాల రాయితీ, కారుణ్య నియామకాలు, మెడికల్ బోర్డు ఏర్పాటు, ఉద్యోగుల గైర్హాజరు, తదితర విషయాలపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్ రెడ్డి, సంక్షేమాధికారులు మురళి, సంతన్, సురేందర్, పాల్ సృజన్, హరికృష్ణ, రమేష్, వెంకన్న, ఓంకార్ బాబు, కిరణ్ తేజ, సీనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పిడుగు పడి ఎద్దు మృతి

జైపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి వేలాల గ్రామంలో పిడుగుపడి కౌలు రైతు పంచిక మల్లేష్‌కు చెందిన ఎద్దు మృతిచెందింది. మృతిచెందిన ఎద్దు విలువ సుమారు 45 వేల రూపాయలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి



మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న కమిషనర్

బెల్లంపల్లి, జూలై22 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో స్వయం సహా యక సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను ప్రారంభించి మాట్లాడారు. వందరోజుల ప్రణాళికలో భాగంగా స్వయం సహాయక మహిళా గ్రూపులు 50వ రోజును విజయవంతంగా పూర్తి చేసుకున్నాయన్నారు. 50రోజుల్లో వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేసి తమ ప్రతిభను చాటారన్నారు. మహిళల్లో నైపుణ్యతను మెరుగుపరుచుకునేందుకు వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. వస్త్రాలు, ఆహార ఉత్పత్తులు, వివిధ రకాల ఉత్పత్తులను మహిళ సంఘాల సభ్యులు ఈ మేళాలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ సాయికిరణ్, ఆర్వో భుజంగరావు, స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల కోసం సంతకాల సేకరణ

హాజీపూర్, జూలై22 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంగళవారం హాజీపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం లక్ష సంతకాల సేకరణలో భాగంగా ర్యాలీగా బయలు దేరారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ కిట్ల పంపిణీ

హాజీపూర్, జూలై22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొనబండ, నబ్బపల్లి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు రఘునాథ్ వెర్రబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బ్యాగ్స్, నోటు బుక్స్, జామెట్రి బాక్స్, పెన్నులతో కూడిన స్కూల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్‌రావు మాట్లాడుతూ ఉన్నత చదువులతో ఉజ్వల భవిష్యత్ సాధించవచ్చునని ప్రతి విద్యార్థి క్రమశిక్షణ పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రోత్సహకంగా ప్రతి ఏటా ఈ కిట్లు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ముఖేష్‌గౌడ్, తిరుపతి, బేతు రవిలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

జైపూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని టేకుమట్ల, నర్సింగాపూర్ గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరుగా సేకరించాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆవాస్ యోజన యాప్‌లో ఇందిరమ్మ ఇళ్ల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో బాలయ్య, హౌజింగ్‌ఏఈ కాంక్ష, పంచా యతీ కార్యదర్శులు శ్రావణి, సుప్రియలు పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి, జూలై22 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఎమ్మెల్యే గడ్డం వినోద్ కుటుంబ సభ్యులు మంగళవారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు కూతురు, మనువడు స్వామిసేవలో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించి పండితుల ఆశీర్వచనం తీసుకొని స్వామి వారితీర్థప్రసాదాలను స్వీకరించారు.

ఘనంగా మోడల్‌స్కూల్‌లో బోనాల పండుగ

మంచిర్యాలక్రైం,జూలై22(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం రాజీవ్‌నగర్ మోడల్‌స్కూల్‌లో ఘనంగా బోనాల కార్యక్రమంతో పాటు మెహందీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ బుచ్చన్న మాట్లాడుతూ బోనాల పండుగలో విద్యార్థులు, మహిళా అధ్యాపకులు ఆనందోత్సహాలతో పాల్గొన్నారన్నారు. సంస్కృతి సంప్రదాయాలను ప్రతిభింబించేలా ప్రదర్శనలు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రావణం..శుభకరం

వెల్లువెత్తనున్న ఆధ్యాత్మికం..

ఆలయాల్లో ప్రత్యేక పూజలు...

పూలు, పండ్ల ధరలు పైపైకి

25 నుంచి శ్రావణ మాసం ప్రారంభం..







నస్పూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం అంటే పండుగల ఆధ్యాత్మిక మాసం. వర్ష రుతువులో పరిసరాలు పచ్చదనం సంతరించుకుని కళకళలాడే కాలం. గృహాలన్నీ ఆధ్యాత్మిక శోభ, నోములు, వ్రతాలు, పూజలతో సందడిగా ఉంటుంది. మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసుకునే మాసం ఇది. ఈ నెల రోజుల వ్యవధిలో లక్ష్మీదేవిని ఆరా ధించిన భక్తులకు సకల సంపదలు అందుతాయని విశ్వా సం. శ్రావణ మాసంలో సోమ, మంగళ, శుక్రవా రాలల్లో రెండు ... మహాశివుడిని, లక్ష్మీ దేవి పూజా రోజున పొద్దున, సాయంత్రం దీపారాధన, ప్రత్యేక పూజలు చేస్తారు. శ్రావణ మాసంలో అష్ట మి, నవమి, ఏకాదశి, త్రయో దశి, చతుర్థశి, అమావాస్య, పూర్ణిమ తిథుల రోజున లక్ష్మీదేవిని పూజిస్తే అత్యంత శ్రేష్టమైన దని చెబుతారు. ఈ నెల 25 నుంచి శ్రావణ మాసం ప్రారంభమై వచ్చే నెల 23వ తేదితో ముగుస్తుంది. జిల్లాలోని ఆలయాలు నిత్యం భక్తుల సందడి నెల కొననుంది. ఈ నెల 29న నాగు పం చమి, ఆగస్టు 8న వరలక్ష్మి వ్రతం, 9న రాఖీ పౌర్ణమి, 16న శ్రీ కృష్ణాష్టమి, 23న పొలాల అమావాస్యతో ముగుస్తుంది.

మంగళగౌరీ వ్రతం..

శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతానికి ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. అలానే మంగళగౌరీ వ్రతం అంటే శ్రావణ మాసంలో వచ్చే నాలుగు మంగళవారాలు మంగళగౌరీని ప్రత్యేకంగా పూజిస్తారు. ఈ వ్రతం చేయడం వలన మహిళలకు సౌభాగ్యకరమైన ఐదవతనం కలకాలం నిలుస్తుందని మహిళల విశ్వాసం. అందుకే ముత్తైదువలు ఎంతో భక్తి శ్రద్ధలతో రోజంతా ఉపవాస దీక్ష తీసుకుని ఆలయాల్లో ఈ వ్రతాన్ని నోముకుంటారు.

మహాలక్ష్మి పూజ...

శ్రావణ శుక్రవారం మహాలక్ష్మిని పూజించడం ద్వారా దీర్ఘసుమంగళిగా ప్రాప్తిస్తుంది. శ్రావణ మాసంలో వచ్చే శుక్రవారాలను మహిళలు నియ మనిష్ఠలతో పూజిస్తే సిరిసంపదలు వెల్లివి రుస్తాయని భక్తుల విశ్వాసం. శ్రావణంలో రెండవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో, వైభవంగా జరుపు కుంటారు. వివాహం అయిన తర్వాత వచ్చే తొలి శ్రావణంలో ఈ వ్రతాన్ని నూతన దంపతులచే చేయిస్తారు. వ్రతం చేసిన మహిళలు తోటి ముత్తై దువులకు పూర్ణాలు, గారెలు వాయనం ఇచ్చి వారి నుంచి ఆశీస్సులు పొందుతారు. మహాలక్ష్మీ విగ్రహాన్ని అందంగా అలంకరించి పేరంటాలను పిలిచి తాంబూలం ఇస్తారు.

వరలక్ష్మి వ్రతం...

శ్రావణ మాసంలో శుక్ల పక్షం, పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని జరుపుతారు. వరాలు ఇచ్చే దేవతగా వరలక్ష్మిని కొలుస్తారు. వివాహమైన మహిళలు మాత్రమే నిర్వహిస్తారు. ఈ రోజున పూజిస్తే అష్టలక్ష్మిలను పూజించినట్లేనని మహిళల నమ్మకం. అష్టైశ్వర్యాలను కలగజేసే అష్ట లక్ష్మీ రూపాన్నే వరలక్ష్మీ దేవిగా ఆరాధించి భక్తితో పూజించిన వారికి కొంగు బంగారమై నిలుస్తుందని నమ్మకం. ఈ మాసంలో ఈ వ్రతాలను చేస్తే విశేష ఫలితాలు అందుతాయని పురాణాల్లో చెప్పబడింది.

మార్కెట్‌లో సందడి...

శ్రావణ మాసం భక్తి మాసం కావడంతో మార్కెట్‌లో పూజ సామగ్రి కొనుగోళ్లతో వ్యాపార కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ఆధ్యాత్మిక మాసంలో పూలు, పండ్ల తదితర వాటి ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. కిలో బంతి పూలు రూ. 120 నుంచి 150, చామంతి కిలో రూ. 550, ఇతర పూలు కిలో 250 నుంచి 350 వరకు, పూజ సామగ్రి రూ. 250 నుంచి 500వరకు, వంద తమలపాకులకు రూ. 60, అరటి పండ్లు డజను రూ. 60 నుంచి 80 వరకు లభిస్తున్నాయి. శ్రావణ మాసం ప్రారంభం సందర్భంగా పూలు, పండ్ల ధరలు అమాంతం పెరిగిపోయాయి.

ఆధ్యాత్మిక మాసం..

వంశీకృష్ణ శర్మ, పూజారి, నస్పూర్ కాలనీ

శ్రావణ మాసం మహిళలకు ఆధ్యాత్మిక మాసం.. చాలా మంది పూజ కార్యక్రమాల్లో నిత్యం పాల్గొంటారు. శ్రావణ మాసంలో మంగళగౌరీ, మహాలక్ష్మీదేవి, వరలక్ష్మీ వ్రతాలను మహిళలు ఆచరిస్తారు. ప్రతీ ఇంట్లో ఈ మాసంలో పూజలు నిర్వహిస్తే అనుకున్న కోరికలు నెరవేరడంతో పాటు మంచి ఫలితాలు లభిస్తాయి.



బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటాం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బెల్లంపల్లి, జూలై22 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబుతో చీకటి ఒప్పందం కుదుర్చుకొని అక్రమంగా నిర్మించుకున్న బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకుంటామని బీఆర్ఎస్‌వి జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ అన్నారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీఆర్ఎస్‌వి ఆధ్వర్యంలో విద్యార్థులకు బనకచర్ల ప్రాజెక్టుపై అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం అక్రమంగా నిర్మించనున్న బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు జరిగే అన్యాయం పై విద్యార్థులకు అవగాహన ఉండాలనే ఉద్దేశంతో కార్యక్రమం చేపట్టామన్నారు. పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల గోదావరి జలాలను రాయల సీమకు తరలించడం కోసం ఏపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందన్నారు. తెలంగాణ నీళ్లను ఆంధ్రకు దోచిపెట్టడానికి సీఎం రేవంత్‌రెడ్డి చంద్రబాబుతో చీకటి ఒప్పందాన్ని కుదుర్చుకున్నారన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలను నేటి వరకు అమలు చేయ కపోవడం సరైంది కాదన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారన్నారు. విద్యార్థులకు స్కూటీలు ఇస్తామని హామీ ఇచ్చిందే తప్ప అధికారంలోకి వచ్చినా ఏ ఒక్క విద్యార్థికి కూడా పంపిణీ చే యలేదన్నారు. వెంటనే ప్రభుత్వం గోదావరి బనక చర్ల లింకు ప్రాజెక్టును రద్దు చేయాలని లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరుణ్, సుమన్, శ్రావణ్, రోషన్, అజయ్, సాయికిరణ్, సంతోష్‌లు పాల్గొన్నారు.

నేటి సమాజంలో మహిళలకు విద్య అవసరం

నస్పూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో మహిళలకు విద్య ఎంతో ముఖ్యమైందని, పట్టుదలతో చదువుకోవాలని మండల విద్యాధికారి పద్మజ అన్నారు. నస్పూర్ మండల మెప్మా కార్యాలయంలో టీఓఎస్ఎస్ ఓపెన్ స్కూల్ అడ్మిషన్లలో భాగంగా ఆర్‌పీల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ముంద్రించిన పోస్టర్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో పద్మజ మాట్లాడుతూ మహిళలకు చదువు తప్పని సరి అని, వారు స్వయంకృషితో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. టీసీ, బోనఫైడ్, పుట్టిన తేదీ ధృవపత్రాలతో పదవ తరగతి, ఇంటర్ ఒకే సంవత్సరం పూర్తి చేయవచ్చన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చదువు లేకుండా ఉండటం వలన ఎంతో నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ సమావేశంలో మెప్మా కో అర్డినేటర్ నాగరాజు, ఓపెన్ స్కూల్స్ కో ఆర్డినేటర్లు రేగళ్ల ఉపేందర్, సహాయ కో అర్డినేటర్ శ్రీనివాస రావులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈవో పద్మజ, ఇతర ఉపాధ్యాయులు

ప్రతీ ఒక్కరు జాతీయ జెండాను గౌరవించాలి

చెన్నూరు, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు జాతీయ జెండాను గౌరవించాలని లయన్స్‌క్లబ్ సభ్యులు అన్నారు. చెన్నూరులోని కొత్తగూడెం కాలనీలో గల ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం జాతీయ త్రివర్ణ పతాకం అడాప్షన్ డేను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్ల అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు జాడి తిరుపతి మాట్లాడుతూ 1947 జులై 22న మన రాజ్యాంగ సభ త్రివర్ణ పతాకాన్ని భారత దేశ జాతీయ జెండాగా స్వీకరించిన సందర్భంగా జాతీయ త్రివర్ణ పతాకం అడాప్షన్ డేగా జరుపుకుంటున్నామన్నారు. క్లబ్ సభ్యులు శ్రీనివాస్, ప్రతాప్‌సింగ్, పోచన్న, సత్యనారాయణ, సాగర్ పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టు

జన్నారం, జూలై22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ చలో గన్‌పార్కు అనే పిలుపునివ్వడంతో మంగళవారం తెల్లవారుజామునే ఉద్యమకారులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మండలంలోని తపాల్‌పూర్ గ్రామానికి చెందిన విజయధర్మను అదుపులోకి తీ సుకున్నారు. ఈ సందర్భంగా విజయదర్మ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చ లేక ఉద్యమకారులు ముందస్తు అరెస్టు చేయ డం సరికాదన్నారు.

ఘనంగా దాశరథి కృష్ణమాచార్య జయంతి

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణంలో మంగళవారం దాశరథి కృష్ణమాచార్య 100వ జయంతిని దళిత హక్కుల పోరాట సమితి నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి దేవి పోచన్న ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు సాహిత్యానికి దాశరథి చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, లక్ష్మణ్, రాంసాగర్, స్వామి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామగుండం శానిటరీ సూపర్‌వైజర్‌గా శ్యాం

కుమారస్వామి మంచిర్యాలకు బదిలీ

కోల్‌సిటీ, జూలై 22(ఆంధ్రజ్యోతి): రామగుండం నగరపాలక సంస్థ శానిటరీ సూపర్‌వైజర్‌గా వరంగల్‌లో పనిచేస్తున్న శ్యాంకు పోస్టింగ్‌కు ఇచ్చారు. రామగుండంలో పని చేస్తున్న కుమారస్వామిని మంచిర్యాలకు బదిలీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా పని చేస్తున్న శ్యాం, కుమారస్వామిలకు శానిటరీ సూపర్‌వైజర్లుగా పదోన్నతి లభించింది. రామగుండం నగరపాలక సంస్థలో శానిటరీ విభాగంలో ఇద్దరు శానిటరీ సూపర్ వైజర్లు, ఆరుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉండాల్సి ఉంది. ప్రస్తుతం ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టును భర్తీ చేశారు. మరో నాలుగు శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

'ఓపెన్' చదువులు భవితకు వెలుగు

దండేపల్లి జూలై 22 (ఆంధ్రజ్యోతి): చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ చదువు భవితకు వెలుగులాందని జిల్లా సెక్టోరియల్ అధికారి సత్యనారాయణమూర్తి, మండల విద్యాధికారి దుర్గం చిన్నయ్య అన్నారు. దండేపల్లిలో మంగళవారం స్థానిక విద్య వనరుల కేంద్రం వద్ద తెలంగాణ ఓపెన్ స్కూల్ సోసైటీ ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, పదో తరగతి పూర్తయిన వారు, ఇంటర్ ఫెయిల్ అయిన వారు తిరిగి ఇంటర్ చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. పదవ తరగతి చదివి ఉన్నత చదవలేని వారు ఒకే సంవత్సరంలో ఇంటర్మీడియేట్ విద్యను పూర్తి చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. మహిళలకు ,పలు వృత్తి, విద్య, వ్యాపార రంగాల్లో ఉన్న వారికి ఉద్యోగులకు ప్రజా ప్రతినిధులకు వివిధ సంఘాల సభ్యులకు సామాజిక ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి ఇది చక్కటి అవకాశమన్నారు. సెలవు దినాల్లోమాత్రమే తరగతులు నిర్వహిస్తారు. చదువు రాని వారికి ఇదొక వరంగా ఉంటుందన్నారు. ఆడ్మిషన్ పొందడానికి ఈనెల 31వరకు అవకాశం కల్పించామన్నారు. అభ్యాసకులు అవకాశంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం ఓపెన్ స్కూల్ సహాయ కోఆర్డినేటర్ సంగర్స్ రాజేశ్వర్ రావు(7309769067)లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐసీ నగేష్, సీసీవో మల్లేష్, సీఆర్‌పిలు గరిగే నర్సయ్య, ఉగ్గె రమేష్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

లక్షెట్టిపేట, జూలై 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని లక్షెట్టిపేట ఏజీపీ వెల్బుల సత్యం అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆంటీ డ్రగ్స్ అవెర్నెస్ ప్రోంగ్రాంకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఏజీపి మాట్లాడుతూ మారుతున్న సామాజిక ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకుని ప్రతీ విద్యార్థి ఒక లక్ష్యం ఎంచుకుని ఆలక్ష్య సాధనకు క్రమశిక్షణ పట్టుదలతో చదవాలని సూచించారు. గంజాయి. డ్రగ్స్ లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఒక సారి వాటికి అలవాటు పడితే జీవితంలో ముందుకు పోలేమన్నారు. పిల్లలు ఏం చేస్తున్నారు, ఎటు తిరుగుతున్నారు అనే విషయాలపై తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. పిల్లలు చెడు అలవాట్లకు బానిసలు అవుతున్నారు అంటే తల్లిదండ్రులు కూడా బాధ్యులు అవుతారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఒక్క సారి దారి తప్పితే మళ్లీ చేతిల్లోకి రారని, మత్తు పదార్థాలకు అలవాటు పడి పోలీసులకు చిక్కితే జీవితం నాశనం అవుతుందన్నారు.

ఈకార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ ఆకుల శ్రీనివాస్, అంబేద్కర్ జిల్లా కోఆర్డినేటర్ కొల్లూరి రవి కుమార్, జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపన్న, మదు, రాజేష్, రాజలింగు, రమేష్, నవీన్ కుమార్, విక్రమ్, శివ, కుమార్ పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

● రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి



జన్నారంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

దండేపల్లి జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఆదివాసి గిరిజన సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండి, జీవో 49ను రద్దు చేసింది రాష్ట్ర ప్రభుత్వమని గిరిజన కార్పొరేషన్ ఛైర్మన్ కట్నాక తిరుపతి అన్నారు. జీ వో 49ను ప్రభుత్వం రద్దు చేయడం పట్ల మంగళవారం ఆదివాసి గిరిజన సంఘల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నాయకులు తాళ్లపేటలో కోమురం భీం విగ్రహానికి క్షీరాభిషేకం చేసి ఘనంగా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం, డిప్యూటీ సీఎం మంత్రులు, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆదివాసి సేన జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సంఘం నాయకులు జంగు, లచ్చుపటేల్, సంతోష్, ఆకాంతరావు, హన్మంతు, సంతోష్, లాల్‌సాబ్, జం గు, పున్నంచందు పాల్గొన్నారు.

జన్నారం: ఆదివాసీల విన్నపం మేరకు స్పందించి జీవో నంబర్ 49 ని రద్దు చేయడం హర్షనీయమని మండల కాం గ్రెస్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆదివాసీల ఉనికి కాపాడేందుకు కాంగ్రెస్ ఎప్పుడు ముందుంటుందన్నారు. మంత్రి సీతక్క ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మంత్రి జూపెల్లి క్రిష్ణరావుతో పాటు మంత్రి వివేక్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కృతజ్ఞతలు తెలిపారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముజాఫర్ అలీ, ఎఎంసీ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు మాణిక్యం, సయ్యద్ ఇసాక్, నందు నాయక్ పాల్గొన్నారు.

కాసిపేట: 49 జీవోను రద్దు చేయాలి కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘాల ఆందోళన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి జీవోను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. జీవోను నిలుపుదల చేయడంతో మంగళవారం దేవాపూర్ కొముురంభీం చౌరస్తా వద్ద రేవంత్ చిత్రపటానికి గిరిజన సంఘాల నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఆదివాసీ సేనా మండల అధ్యక్షుడు మడావి వెంకటేశ్, ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు మడావి గంగారాం, కొముురం జనార్ధన్, వల్కా చిలుకయ్య, ఆత్రం మహేశ్, అచ్యుత్‌రావు, కృష్ణరావులు పాల్గొన్నారు.

దేవాపూర్ రోడ్లపై ఆవులు ప్రమాదాలకు నెలవులు

కాసిపేట, జూలై22 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ సిమెంట్ కంపెనీ లారీయార్డుతో పాటు ప్రధాన రహదారిపై ఆవుల మంద లు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీనితో వాహనదారులు రాత్రిపూట ఆవులను ఢీకొట్టడంతో ప్రమాదాల భారిన పడుతున్నారు. దీని విషయమై గతంలో ఆవుల యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఎవరు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువుల యజమానులు ఇండ్లలో కట్టివేయకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో రాత్రివేళల్లో రోడ్లపైన తిరుగుతూ పొట్లాడుకుంటున్నాయి. అతివేగంగా వచ్చిన వాహనదారులు అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు. ఆవులను రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు వాటి కొమ్ములకు రేడియం స్టిక్కర్లు అంటించడం వల్ల ముందస్తుగానే ఆవులను గుర్తించవచ్చు నని స్థానికులు అభిప్రాపయడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మార్పు మంచికే..

(5వ పేజీ తరువాయి)

తీసుకునే వారిలో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. మనుషులతో పాటు పశు సంపదపై దుష్ప్రభావాలు ఉంటాయి. ఇంతేకాకుండా సాగు భూమిని స్సారమవు తుంది. ఏళ్ల తరబడి మందులు పిచికారి చేస్తే కొన్ని గడ్డిజాతి మొక్కలు అంతరించిపోతాయి. అంతర పంట వేసే వీలుండదు. విత్తనలోపం, ఇతర కారణాలతో పంట నష్టపోతే కంపెనీలను ప్రశ్నించే వీలుండదు. బీజీ-3 సాగుతో చేలు విషతుల్యమై భూసారం దెబ్బతింటుంది. ఈ పంటను తిన్న పశువుల పాలను మనుషులు తాగడం వల్లా శారీరకంగా తీవ్ర అనారోగ్య పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుంది. దూదిని వేరు చేసిన తరువాత గింజలను నూనె తీయడానికి వాడుతు న్నారు. ఆ నూనె వాడితే ఆరోగ్యం దెబ్బతింటుంది.

కలుపు నివారణ కష్టమే అయినప్పటికీ...

పత్తి పంటలో కలుపును అదుపు చేయడం తలకు మించిన భారమే. వాతావరణం అనుకూలిస్తే గుంటుకలు తిప్పుకొని కలుపు అదుపు చేసుకోవచ్చు. కాని అరకల కొరత కారణంగా ఎక్కువ మంది రైతులు కలుపు నివారణకు రసాయణాలనే పిచికారి చేస్తున్నారు. పత్తిలో కలుపు నివారణ కోసం మార్కెట్లో మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. నిర్ధేశిత సమయంలోగా మందులు పిచికారి చేయాల్సి ఉంటుంది. పొడి దుక్కిలోనే స్ప్రే చేసుకునే పెండామిథిలిన్, విత్తనాలు వేసిన 20 రోజుల్లోగా కలుపు లేతగా ఉన్నప్పుడు స్ప్రే చేసుకునే క్విజ లోఫాల్ ఏథిల్ లేదా ప్రొపాఖిజాపాప్, పైరథోబాక్ సోడియం లాంటి ప్రభావవంతమైన మందులు అందుబాటులో ఉన్నాయి. అదనులోగా పిచికారి చేస్తే ఈ మందులు కలుపును సమర్థవంతంగా నివారిస్తాయి. పత్తి చెట్లపై మందు పడకుండా సాళ్ల మధ్యన కలుపుపై మాత్రమే పిచికారి చేసుకునే గ్లుఫోసినేట్ అమ్మోనియం, ప్యారాక్వీట్ మందులు తక్కువ ధరకే లభిస్తున్నాయి.



పత్తి పంట

ఘనంగా గీతా హవన యజ్ఞం

నస్పూర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ కాలనీలోని శ్రీ గీతా ప్రశాంతి నిలయంలో శ్రీమద్భవద్గీత సత్సంగం వెల్ఫేర్ సోసైటీ ఆధ్వర్యంలో మంగళవారం రెండో ద్వాదశి యజ్ఞం, గీతా హవన యజ్ఞం ఘనంగా జరిగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేసి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు దాసరి రాజేశం గురువు, కన్వీనర్ ప్రసాద్, కార్యదర్శి రాంబాబు, కార్యకర్తలు రాజేశం, శంకర్, రాజేశ్వరి, స్వర్ణ కుమారి, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

జన్నారం, జూలై22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాంపూర్ గ్రామానికి చెంది గొర్రె శాంతయ్య ఇటీవల కువైట్ దేశంలో చిక్కుకోవడంతో వారి కుటుంబానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ ఆర్థికాసాయాన్ని మండల శ్రేణుల ఆధ్వర్యంలో పదివేల ఆర్థికాసాయాన్ని అందజేశారు. అనంతరం వారితో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వం వారి కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. బాధితున్ని స్వగ్రామానికి రప్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

రేషన్ కార్డుల పంపిణీకి కసరత్తు

- ఈనెల 25 నుంచి షురూ
- జిల్లాలో 7,443 మంది అర్హులు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్త రేషన్ కార్డుల పంపిణీకి అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు మంజూరైన లబ్ధిదారుల కార్డులు జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి చేరుకున్నాయి. వాటిని అధికారులు మండలాల వారీగా వేరు చేస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈనెల 25 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో పంపిణీ చేయాలని సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2019, 2021లలో కొత్తగా ఆహర భద్రత కార్డులు జారీ చేశారు. ఆ తరువాత కొత్త కార్డుల జాడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజాపాలన, మీసేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. రెవెన్యూ అధికా రులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులను గుర్తించారు.



● జిల్లాలో 1,41,904 కార్డులు..

రేషన్ కార్డుల కోసం మీసేవా కేంద్రాల ద్వారా 10,410 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీటిలో 7,443 మంది అర్హులుగా గుర్తించింది. 134 దరఖాస్తులను తిరస్కరించింది. మిగతావి డీఎస్‌వో, తహసీల్దార్, ఆర్‌ఐల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే వివాహమై పిల్లలు కలిగిన వారు కొత్తగా వారి పేర్లను చేర్చడం కోసం దరఖాస్తులు చేస్తున్నా రు. ప్రస్తుతం జిల్లాలో 1,41,904 కార్డులు ఉండగా ఇందులో 4.48 లక్షల మంది సభ్యులున్నారు.

● కొత్త సభ్యుల చేర్పుల కోసం...

వివాహమై పిల్లలు కలిగిన వారు కొత్తగా వారి పేర్లను చేర్పించడం కోసం దరఖాస్తులు చేస్తున్నారు. మీసేవా కేంద్రాల ఏప్రిల్ నుంచి జూలై 15 వరకు 24,637 కార్డుదారులు కొత్త సభ్యుల చేర్పుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వీటిలో 21,613 మంది కార్డులో సభ్యులను జోడించి మంజూరు చేశారు. మిగతా కార్డులకు సంబంధించి అధికారులు పరిశీలిస్తున్నారు.

అర్హులందరికీ ఇస్తాం..
- డేవిడ్, డీఎస్‌వో, ఆసిఫాబాద్

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ. మీసేవా, ప్రజాపాలన సభల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలన చేసి అర్హులైన వారందరికి కార్డులిస్తాం. జిల్లాలో 7,443 కార్డులు లబ్ధిదారులకు మంజూరయ్యాయి. వాటిని ఈనెల 25వ తేదీ నుంచి అందజేస్తాం.

గుంతల దారి.. ఇబ్బందిగా మారి


గుంతల మయంగా మారిన లోడ్‌పల్లి రోడ్డు

పెంచికలపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపల్లి, జైహింద్‌పూర్ గ్రామాల ప్రజలు బురదమయంగా మారిన గుంతల దారిలో ప్రయాణం చేయడానికి అపసోపాలు పడుతున్నారు. తేలిక పాటి వర్షాలకు లోడ్‌పల్లి-కొండపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారి బురదమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతన రోడ్డు నిర్మాణం కోసం ఉన్న రోడ్డును తవ్వి వదిలేశారు. తారు రోడ్డు నిర్మాణం కాకపోగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఉదయం మండల కేంద్రానికి పాఠశాలకు వెళ్లే విద్యార్థులను ఆటోలో తరలించాలంటే భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆగస్టు 15లోపు భూ సమస్యలు పరిష్కరించాలి

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఆసిఫాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆగస్టు 15 నాటికి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావుతో కలిసి వసతి గృహాలు, విద్యార్థుల ఆరోగ్యం, భూ భారతి చట్టంలో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, సాదాబైనామాల దరఖాస్తుల పరిశీలన, ఇందిరమ్మ ఇళ్ల పనుల వేగవంతం, వనమహోత్సవం తదితర అంశాలపై వీసీ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టంలో భాగంగా నిర్వహించి సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి అర్హులైన రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి హాజరయ్యారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా

వీసీ అనంతరం అదనపు కలెక్టర్లు జిల్లా అధికారులతో మాట్లాడుతూ అధికారులు, ప్రత్యేకాధికారులు తమ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలను సందర్శించాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారంలో నాణ్యత పాటించేలా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతంగా జరిగే చర్యలు తీసుకోవాలని, వన మహోత్సవంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ నెల 25 నుంచి ఆగస్టు 10 వరకు రేషన్ కార్డుల పంపిణీకి చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో అటవీ డివిజన్ అధికారి దేవిదాస్, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సీతారాం, జిల్లా గిరిజన అభివృద్ధి అధికా రి రమాదేవి, మైనార్టీ సంక్షేమాధికారి నదీమ్, హౌజిం గ్ పీడీ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్యురాలిగా స్పందన



సిర్పూర్(టి), జూలై 22 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రం లోని ఆయూష్మాన్ భారత్ హోమియోపతి డాక్టర్‌గా మంచిర్యాల జిల్లాకు చెందిన డాక్టర్ స్పందనను ప్రభుత్వం రెగ్యులర్‌గా నియమించింది. ఈ మేరకు డాక్టర్ స్పందన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

శివాజీ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించేలా ప్రకటించాలని ఆరె సంఘం ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆరె సంఘం నాయకులు జయరాం, దాదాజీ, మహేష్, సంతోష్, సుబ్బారావు, దామోజి, మారుతి, వినోద్, శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

-సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు

కాగజ్‌నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద మంజూరు చేసిన సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు సూచించారు. మంగళవారం కాగజ్‌నగర్ మున్సిపాటిటీలో కల్యాణలక్ష్మి, షాదీముబాకర్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ పథకాల కింద అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పెండింగ్ సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్, మాజీ కౌన్సిలర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్ సీఐగా కుమార స్వామి



కాగజ్‌నగర్ టౌన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ రూరల్ సీఐగా కుమారస్వామిని నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కాగజ్‌నగర్ రూరల్ సీఐగా పని చేసిన శ్రీనివాస్‌రావు బదిలీపై బెల్లంపల్లికి వెళ్లారు. దీంతో రూరల్ సీఐగా కుమార స్వామిని బదిలీ చేస్తూ ఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

నిరుద్యోగుల ర్యాలీని అడ్డుకున్న పోలీసులు


పోలీసు స్టేషన్ ఆవరణలో ఉన్న వివిధ పార్టీల నాయకులు

కాగజ్‌నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఎంలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ పొన్న రమేష్ ఆధ్వర్యంలో వివిధ సంఘాల నాయకులు, నిరుద్యోగులతో మంగళవారం చేపట్టిన ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. ఈ ర్యాలీకి అనుమతి లేదని, పట్టణంలో 30 యాక్టు అమల్లో ఉందని పేర్కొంటూ ర్యాలీ చేపట్టిన వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయా సంఘా నాయకులు ముంజం ఆనంద్ కుమార్, అంబాల ఓదెలు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తూ పోలీసులు అరెస్టు చేయటం దారుణమన్నారు. అరెస్టులను ఖండిస్తున్నట్టు తెలిపారు. నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ పొన్న రమేష్ మాట్లాడుతూ ఎస్పీఎంలో స్థానికులకు అవకాశాలివ్వకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి అవకాశం ఇవ్వటంపై మండిపడ్డారు. ఈ ప్రాంత వనరులతో అభివృద్ధి చెందుతున్న జెకె యాజమాన్యం ఇక్కడికి వారికి పూర్తిగా అన్యాయంచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ర్యాలీలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జీవో 49 తాత్కాలిక రద్దు కంటితుడుపు చర్య

- సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు

కాగజ్‌నగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జీవో 49ని తాత్కాలికంగా రద్దు చేయటం కేవలం కంటి తుడుపు చర్య అని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. మంగళవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ సంఘాలు, బీజేపీ, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఏజెన్సీ ప్రాంతాల బంద్ సంపూర్ణ కావటంతోనే ప్రభుత్వం దిగి వచ్చిందని పేర్కొన్నారు. జీవో తాత్కాలిక రద్దు కేవలం ఉద్యమాన్ని శాంతింపజేసేట్టు చేసేందే అన్నారు. జీవో శాశ్వతంగా రద్దు అయ్యేంత వరకు పోరాటాలు విరమించేదిలేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశిస్తేనే జీవో తెచ్చామని కాంగ్రెస్ నాయకులు బీరాలు పలికారని, ఇప్పుడు తాత్కాలిక నిలుపుదల ఆర్డర్స్ ఇవ్వటానికి కేంద్రాన్ని సంప్రదించారా..? అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వానికి ప్రమేయం లేని అంశంలో బీజేపీని టార్గెట్ చేయడం మానుకోవాలని హితవుపలికారు. ఈ నెలాఖరు వరకు జీవో రద్దుచేయని పక్షంలో ఆగస్టు మొదటి వారంలో నిరవధిక దీక్షకు కూర్చుంటానని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, జిల్లా కోశాధికారి అరుణ్ లోయా, మాజీ కౌన్సిలర్లు ఈర్ల విశ్వేశ్వర్ రావు, సిందం శ్రీనివాస్, బాల్కశ్యాం, మాజీ ఎంపీపీ మనోహర్‌గౌడ్, చిప్పకుర్తి శ్రీనివాస్, కొండ తిరుపతి, సాంబయ్య, గణపతి, లింగమూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీవో 49 పూర్తిగా రద్దు చేసే వరకు పోరాటం

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో టైగర్ కన్జర్వేషన్ ఏర్పాటు చేయాలని తీసుకువచ్చిన జీవో నంబర్ 49ను పూర్తిగా రద్దు చేయాలని ఎమ్మెల్యే కోవలక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజాపాలన కాదని ప్రజలను పీడించే రాక్షస పాలన అని ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి దమ్ముంటే జీవో నంబర్ 49ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి చులకనగా కనపడుతున్నారని, జల్ జంగల్ జమీన్ హక్కుల కోసం పోరాడిన వీరుడు కుమరం భీం స్ఫూర్తితో జీవోను పూర్తిగా రద్దు చేసే వరకు ఎంతకైనా పోరాడుతామని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం లు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సరస్వతి, పోచయ్య, శంకర్, కిష్టయ్య, రవీందర్, అహ్మద్, నిసార్, సాజిద్, భీమేష్, అన్వార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

నిరుపేదలకు ఇళ్లు కేటాయించకపోవడం దారుణం


ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

చింతలమానేపల్లి, జూలై 22(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించకపోవడం దారుణమని మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కర్జెల్లి, చింతలమానేపల్లి తదితర గ్రామాలకు చెందిన నిరుపేదలకు తమకు ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేటాయించిన ఇందిరమ్మ లబ్ధిదారుల్లో నిజమైన అర్హులు ఎవరూ లేరన్నారు. రాజకీయ నాయకుల అండదండలతో వారు చెప్పిన వారికే ఇళ్లు మంజూరు చేశారని విమర్శించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

ఆసిఫాబాద్ రూరల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లా కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాల విద్యార్థులకు పలు అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. తడిచెత్త, పొడి చెత్త వేరుచేయడం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపైన, కుక్క కాటు నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడంతో పాటు వన మహోత్సవంలో భాగంగా చెట్లు నాటారు. కార్యక్రమంలో కమిషనర్ గజానంద్, హెచ్‌ఎం విజయలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి విద్యాసంస్థల బంద్‌కు మద్దతు

ఆసిఫాబాద్, జూలై 22: విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం విద్యార్థి వామపక్షాల సంఘాల బంద్‌కు డీవైఎఫ్ఐ మద్దతు ఇస్తుందని ఆ సంఘం నాయకుడు టీకానంద్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బంద్‌కు అన్ని విద్యాసంస్థలు మద్దతు తెలిపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, జశ్వంత్, రాకేష్, చైతన్యకుమార్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

25న అవగాహన సదస్సు

జైనూర్, జులై22:(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ కమిటీ యార్డులో 25వ తేదీన మానవ అక్రమ రవాణపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జైనూర్ సీఐ వెలుప్పల రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ మంగళవారం తెలిపారు. మార్కెట్ యార్డులో ఏర్పాట్లను వారు పరిశీలించారు. అవగాహన సదస్సుకు మంత్రి సీతక్క, కలెక్టర్, ఎస్పీ హాజరవుతారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాజ్‌కుమార్, గుస్సాడీ బృందం లీడర్ కనక సుదర్శన్, మార్కెట్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

ఆసిఫాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మంగళవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. కౌటాలలో 24.3 మిల్లీమీటర్లు, జైనూరులో 19, చింతలమానేపల్లిలో 17, సిర్పూర్(యూ)లో 13.5, సిర్పూర్(టి)లో 11, ఆసిఫాబాద్, బెజ్జూరులో 10.8, లింగాపూర్‌లో 6.8, దహెగాంలో 4.3, కాగజ్‌నగర్ పెంచికలపేటలో ఒక మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

బెజ్జూరు (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలంలో మంగళవారం సాయంత్రం వర్షం కురిసింది. రైతులు సాగుచేస్తున్న పంటలకు కురిసిన వర్షం ఊరట కలిగించింది. మండలంలో రైతులు సాగు చేస్తున్న పత్తి, వరి పంటలకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు తెలిపారు. అడపదడప కురుస్తున్న వర్షాలకు రైతులు పంటల సాగుకు శ్రీకారం చుట్టారు.


బెజ్జూరులో కురుస్తున్న వర్షం

కేటీఆర్‌ను కలిసిన హజ్ కమిటీ మాజీ సభ్యుడు

జైనూర్, జూలై 22: (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను రాష్ట్ర హజ్ కమిటీ మాజీ సభ్యుడు, మండల పార్టీ అధ్యక్షుడు ఇంతీయాజ్‌లాల మర్యాద పూర్వకంగా మంగళవారంకలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు ఇంతీయాజ్‌లాల జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆనంతరం పార్టీ జిల్లాలో పార్టీ పరిస్థితిని వాటిని మరింత పటిష్ఠం చేసేందుకు అనుసరించాల్సిన విధానాలపై చర్చించారు. రానున్న కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి రాబోతుందని భరోసా ఇచ్చారు.

జీవో 49 నిలుపుదల హర్షణీయం

- డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం




ఆసిఫాబాద్, బెజ్జూరు, కాగజ్‌నగర్‌లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

ఆసిఫాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని జీవో నంబర్ 49 నిలుపుదల చేయడం ప్రజాప్రభుత్వం గొప్పతనమని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అన్నారు. జీవో నంబర్ 49ని ప్రభుత్వం నిలుపుదల చేయడాన్ని హర్షిస్తూ పార్టీ కార్యాలయంలో సీఎం చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలేష్‌గౌడ్, మల్లేష్, మునీష్, లక్ష్మణ్, ప్రకాష్‌రావు, నారాయ ణ, రమేష్, కుసుంరావు, దేవాజీ, నారాయణ, దత్తు, అసద్, కళావతి పాల్గొన్నారు.

బెజ్జూరు (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివాసీ నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు విశ్వేశ్వర్, శంకర్, విష్ణు, రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుసుంరావు, నానేశ్వర్, లింబారావు తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాబురావు, ఎమ్మెల్యే హరీష్‌బాబు, కోవలక్ష్మి, బొజ్జుపటేల్, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, మల్లేష్, సకారాం, లక్ష్మయ్య, చంద్రశేఖర్, గురుదాస్, మధుకర్, శ్రీనివాస్, మొగలయ్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ (ఆంధ్రజ్యోతి): జీవో49ని తాత్కాలిక రద్దు చేసి రాష్ట్ర సీఎం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, మున్సిపల్ మాజీ చైర్మన్ దస్తగీర్, మాజీ కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జైనూర్ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ మాజీ వైస్ ఎంపీపీలు షేక్ రషీద్, చిర్లే లక్ష్మణ్, మండల పార్టీ ఉపాధ్యక్షులు పెందూర్ ప్రకాష్, నాయకులు పాల్గొన్నారు.

భరోసాపై అవగాహన

ఆసిఫాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని డీడీయూ జీకేవై స్కిల్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ భరోసా టీం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా భరోసా ఇన్‌చార్జి ఎస్సై తిరుమల మాట్లాడుతూ విద్యార్థినులకు ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, మహిళల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మికులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాలు వంటి విషయాలను వివరించారు. విద్యార్థినులు వేధింపులకు గురైనట్లయితే 8712670561 లేదా 100కు సమాచారం అందించాలన్నారు. ఈ క్యాక్రమంలో లీగల్ సపోర్ట్ పర్సన్ శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

ఆసిఫాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మున్సిపాలిటీ కార్మికులకు జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించకుంటే 15 రోజుల తరువాత సమ్మెకు వెళ్తామని మున్సిపల్ కార్మికులు అదనపు కలెక్టర్ దీపక్ తివారికి మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వడంలో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఉన్న కార్మికులను ఎలా తగ్గించాలనే ఆలోచన ఉంది తప్ప కార్మికులకు వేతనాలు ఇవ్వాలని లేదన్నారు. సీడీఎం కార్యాలయం నుంచి వేతనాలు ఇవ్వాలని సర్క్యూలర్ వచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజయ్య, సమ్మయ్య, బాలేష్, నగేష్, అశోక్, శంకర్, ఇస్తారి, లక్ష్మణ్, బాలయ్య, లక్ష్మి, పద్మ, శ్యామల, లక్ష్మి, మల్లేష్, నగేష్, భుజంగరావు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.